క్లుప్తంగా

గాయత్రీ మాతకు ప్రత్యేక పూజలు


పూజలందుకున్న గాయత్రీ మాత

ఆస్పరి: మండల కేంద్రం సమీపంలోని రామతీర్థంలో వెలసిన గాయత్రీ మాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో నిర్వాహకులు రూపా మోహన్ శర్మ ఆధ్వర్యంలో అమ్మ వారికి కుంకుమార్చన, హోమం, మంగళహారతులు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

దోమల మందు పిచికారీ


డెంగీపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

మద్దికెర: దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రభుత్వ వైద్యాధికారులు రాగిణి, శ్రీలక్ష్మి సూచించారు. డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో దోమల మందు పిచికారీ చేయించారు. డెంగీ నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలన్నారు. హాస్టల్ పరిధిలో పరిసరాల పరిశుభ్రతను, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, జ్వరం వచ్చిన వెంటనే వైద్యశాలలో రక్తపరీక్షలు చేయించుకొని చికిత్సలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్ బాషా, సీహెచ్ఓ నిరంజన్‌బాబు, సూపర్‌వైజర్ సూర్యనారాయణ, ప్రిన్సిపాల్ జ్యోతి, ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ సవిత పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోండి


తొట్టిలో నిల్వ ఉన్న నీటిని పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

దేవనకొండ: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మెడికల్ ఆఫీసర్ కళ్యాణ్ సూచించారు. డ్రైడే–ఫ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వీధుల్లో పర్యటిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. డ్రమ్ములు, తొట్టెల్లో నీటిని నిల్వ ఉంచుకుంటే దోమలు వృద్ధి చెంది వ్యాధులకు కారణమవుతాయని తెలిపారు. దోమకాటుకు గురికాకుండా ప్రజలు రాత్రివేళల్లో దోమతెరలను వాడాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని వడబోసుకుని తాగాలన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి సాయిబాబా, హెల్త్ ఎడ్యుకేటర్ జయలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు,ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


రాస్తారోకో చేస్తున్న దృశ్యం

ఆస్పరి: పగిడ్యాల మండలం పాత ముచ్చుమర్రి గ్రామంలో బాలిక అదృశ్యానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి రవి డిమాండ్ చేశారు. బాలిక అదృశ్యం ఘటనను నిరసిస్తూ శుక్రవారం జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థులతో కలిసి బస్టాండ్ వద్ద రాస్తారోకో చేపట్టారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మహేష్, తరుణ్, చరణ్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వేతనాలు ఇవ్వాలి


పంచాయతీ కార్యదర్శి రామస్వామికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ఆస్పరి: మండలంలోని కైరుప్పల గ్రామానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల వేతనాలు ఇవ్వాలని శుక్రవారం స్థానిక సచివాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి రామస్వామికి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఈసందర్భంగా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బాలకృష్ణ మాట్లాడుతూ కైరుప్పలలో 10 వారాల నుంచి ఉపాధి కూలీలకు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వెంటనే మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, నరసింహులు, కాశన్న, వీరేష్, లక్ష్మన్న పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక.. మొహర్రం

- గ్రామాల్లో కొలువుదీరిన పీర్లు
- వాడవాడలా వేడుకల సందడి

పత్తికొండ రూరల్: మతసామరస్యానికి ప్రతీకగా హిందూ ముస్లింలు సోదరభావంతో నిర్వహించుకునే మొహర్రం సందడి ప్రారంభమైంది. ప్రభుత్వ పీర్లు రెండు రోజుల ముందే కొలువుతీరగా మిగిలిన పీర్ల స్వాముల వారి పెట్టెలను గురువారం రాత్రి ఊరేగించారు. శుక్రవారం అన్నిపీర్ల మసీదుల్లో పీర్ల స్వాములు కొలువుదీరారు. ఏడురోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించే ఈ ఉత్సవాల సందర్భంగా పీర్లచావిడులను నిర్వాహకులు అందంగా అలంకరించి ముస్తాబు చేశారు. 14న ఆదివారం చిన్నసరిగెత్తి, 16న మంగళవారం పెద్దసరిగెత్తి అనంతరం 17న బుధవారం పీర్లస్వాములు ఏటికి బయల్దేరుతారని ముజావర్లు తెలిపారు. చిన్నసరిగెత్తి, పెద్దసరిగెత్తిల సందర్భంగా తెల్లవారుజామున స్వామివార్లు అగ్నిగుండ ప్రవేశం చేస్తారు. ఈవేడుకను తిలకించేందుకు ప్రజలు తండోపతండాలుగా పీర్లచావిడుల వద్దకు చేరుకున్నారు. అర్ధరాత్రి వరకు జరిగే అగ్నిగుంఢం ఎదుట యువత ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా వేసే సావుసేని తెల్లవారుజామున వరకు కొనసాగుతుంది. ఇప్పటికే స్వామివార్ల బండారు, ధూపాలతో పీర్లచావిడులు పరిమళ సుగంధాలు వెదజల్లుతున్నాయి. మొహర్రం సందర్భంగా పీర్ల చావిడుల వద్ద ప్రత్యేక విద్యుద్దీపాలంకరణ చేశారు.


పత్తికొండలో కొలువుదీరిన పీర్లు

అల్లుగుండులో నేడు దస్తగిరిస్వామి సరిగెత్తు


దస్తగిరిస్వామి పీరు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండలం అల్లుగుండు గ్రామ పీర్లచావిడిలో కొలువైన దస్తగిరి స్వామి సరిగెత్తు శనివారం నిర్వహించనున్నారు. అల్లుగుండు, చుట్టుపక్కల గ్రామాలు, వివిధ మండలాల నుంచి సరిగెత్తుకు భక్తులు హాజరు కానున్నారు. సరిగెత్తు పురస్కరించుకుని శనివారం సాయంత్రం నుంచి దస్తగిరిస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకోనున్నారు. స్వామివారు అర్ధరాత్రి సమయం నుంచి సవారీగా గ్రామ పురవీధులుగా భక్త జనసందోహం మధ్య సాగి ఆదివారం ఉదయం తిరిగి పీర్లచావిడిలో ఆశీనులు కానున్నారు. సరిగెత్తు నిర్వహణపై తగిన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ సునీల్‌కుమార్ తెలిపారు.

● చిప్పగిరి: మండలంలో పీర్ల పండుగ వేడుకలు ప్రారంభమయ్యాయి. నంచర్ల, నగరడోణ, నేమకల్లు, రామదుర్గం, ఏరూరు, బెల్డోణ తదితర గ్రామల్లోని పీర్ల చావిళ్లలో పీర్లను కొలువు దీర్చారు. చావిడి ముందు అగ్ని గుండాలు ఏర్పాటు చేసి మంటలు వేశారు. ఈనెల 14న చిన్న సెరిగత్తుతో ప్రారంభమై 17వ తేదీ పీర్ల ఊరేగింపుతో వేడుకలు ముగియనున్నాని నిర్వాహకులు తెలిపారు.


నంచర్లలో కొలువు దీరిన పీర్లు

కొలువుదీరిన పీర్లు

ఆస్పరి: మండలంలోని ఆస్పరి, శంకరబండ, చిరుమాన్‌దొడ్డి, బిల్లేకల్లు, ములుగుందం, బనవనూరు, కారుమంచి, నగరూరు, చిగిళి, చిన్నహోతూరు తదితర గ్రామాల్లో శుక్రవారం పీర్లదేవుళ్లు కొలువుదీరారు. చావిళ్లలో కొలువైన పీర్ల స్వాములకు భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించుకున్నారు. ఈనెల 14న చిన్న పీర్లు, 15న పెద్ద పీర్ల సరిగెత్తు, 16న అన్ని పీర్లు సరిగెత్తు, 17న పీర్లను ఏటికి పంపే కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కాగా గ్రామాల్లో మొహర్రం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ హనుమంతప్ప సూచించారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. ఎవరైన గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

● హాలహర్వి: మండంలోని కామినహాల్ గ్రామంలో శుక్రవారం మొహర్రం వేడుకల్లో భాగంగా పీర్లదేవుళ్ల హజరత్ హిమామ్ హసేన్, హుసేన్ కొలువుదీరారు. ఈనెల 14వ తేదీన చిన్నసరిగెత్తు, 16న పెద్ద సరిగెత్తు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


కామినహాల్‌లో కొలువుదీరిన పీర్లు

మొదలైన మొహర్రం సందడి

ఆలూరు రూరల్: కులమతాలకు అతీతంగా ఏటా భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే మొహర్రం సందడి గ్రామాల్లో ప్రారంభమైంది. శుక్రవారం పలు గ్రామాల్లో పీర్లు కొలవుదీరారు. ఈ నెల 15న చిన్న సరిగెత్తు, 16న పెద్ద సరిగెత్తు నిర్వహించి అగ్నిగుండంలో నిప్పు వెలగించనున్నారు. 17న సాయంత్రం పీర్ల ఊరేగింపు(ఏటికి పంపడం), 20న జియారత్‌తో వేడుకలు ముగియనున్నాయి. పండగ ప్రశాతంగా నిర్వహించుకోవాలని ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు పీర్ల చావిడి నిర్వాహకులకు సూచించారు.


ఆలూరు మండల కేంద్రంలో కొలువైన పీర్లు

కేసు నమోదు

నందవరం: మాచాపురం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులపై పొలం అక్రమ రిజిస్ట్రేషన్ విషయంలో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిమ్మయ్య తెలిపారు. శుక్రవారం ఎస్‌ఐ, బాధితురాలు నరసమ్మ తెలిపిన వివరాలు.. మాచాపురానికి చెందిన కసిరెడ్డి నరసమ్మకు నందవరం గ్రామంలోని సర్వే నంబర్ 112/ఏ లో 4.12 ఎకరాలు, సర్వే నంబర్ 113ఏలో 1.99 కలిపి మొత్తం 6.11 ఎకరాల పొలం ఉంది. సదరు పొలాన్ని గతంలో మాచాపురం గ్రామానికి చెందిన సాగర్ విజయరాజు, సుధీర్ కుమార్, జయప్రభు తండ్రులు కౌలుకు తీసుకుని సాగు చేసేవారు. వారి మరణానంతరం నరసమ్మకు తెలియకుండా సాగర్ విజయరాజు, సుధీర్‌కుమార్, జయప్రభు సదరు పొలాన్ని ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దీనిపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు వెల్లడించారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్‌పై విచారణ

ఆదోని సెంట్రల్: ఉపాధ్యాయుడి సస్పెన్షన్‌పై విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఈ మేరకు శుక్రవారం కౌతాళం మండల విద్యాధికారి శోభారాణి, నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అలీమ్ సిద్ధిఖీ స్థానిక మండల రిసోర్స్ కేంద్రంలో ఉపాధ్యాయుడు శ్రీనివాసులును విచారించారు. పట్టణంలోని ఆది ఆంధ్ర పురపాలక ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న శ్రీనివాసులు తప్పుడు కుల ధ్రువీకరణ పత్రం సమర్పించి ఉద్యోగంలో చేరినట్లు తెలియడంతో ఏప్రిల్ 23వ తేదీన అధికారులు సస్పెండ్ చేశారు. ఈ విషయంపై అధికారులను విచారణకు ఆదేశించారు. వారు శుక్రవారం విచారణ చేపట్టి ఒరిజినల్ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం చూపించాల్సిందిగా శ్రీనివాసులును కోరారు. తన ఒరిజినల్ సర్టిఫికెట్లు కోర్టులో ఉన్నాయని, కోర్టు నుంచి తనకు అందిన తర్వాత సమర్పిస్తానని, లేనిపక్షంలో ఎంఆర్‌ఓ కార్యాలయం నుంచి తీసుకొని సమర్పిస్తానని శ్రీనివాసులు చెప్పినట్లు వారు వెల్లడించారు.

‘డ్రైల్యాండ్ హార్టికల్చర్’ వేగవంతం చేయండి


మాట్లాడుతున్న ఏపీడీ పక్కీరప్ప

తుగ్గలి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలో చేపడుతున్న డ్రైల్యాండ్ హార్టికల్చర్ పనులను వేగవంతం చేయాలని నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) పత్తికొండ క్లస్టర్ ఏపీడీ పక్కీరప్ప సూచించారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో శుక్రవారం ఉపాధి సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. మండల వ్యాప్తంగా 600 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం లక్ష్యం కాగా ఇప్పటికే రైతుల నుంచి దరఖాస్తులు వచ్చాయన్నారు. డ్రైల్యాండ్ హార్టికల్చర్‌కు అర్హత సాధించిన లబ్ధిదారులు వెంటనే తమ పొలాల్లో గుంతలు తవ్వే కార్యక్రమం చేపట్టేలా చూడాలన్నారు. మొక్కలు గ్రౌండింగ్ అయ్యేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. పండ్ల తోటలు సాగుచేసే రైతులకు ఎలాంటి సమస్యలు రాకుండా బిల్లులు అప్‌లోడ్ చేయాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించి కూలీల హాజరుశాతాన్ని పెంచాలని సూచించారు. సమావేశంలో ఏపీఓ రామకృష్ణ, క్లస్టర్ టీఏ గంగన్న, హార్టికల్చర్ సూపర్‌వైజర్ రత్నం పాల్గొన్నారు.

పుల్లగుమ్మిలో విజయవంతంగా పశువైద్య శిబిరం


చూడి ఆవుల పోషకులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లు అందిస్తున్న వెటర్నరీ డాక్టర్లు, గ్రామ నాయకులు

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని పుల్లగుమ్మి గ్రామం పశువైద్య శాలలో పశు వైద్యాధికారి స్వాతి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పశు వైద్య శిబిరం విజయవంతమైంది. కర్నూలు డీఎల్‌డీఏ ఈఓ డాక్టర్ రాజశేఖర్, కల్లూరు ఏడీ డాక్టర్ పార్థసారథి చూడి ఆవులను ప్రత్యేకంగా పరిశీలించారు. పశువులలో గర్భకోశ వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తూ, చూడి పశువులకు తగిన బలవర్ధక ఆహారాన్ని (మినరల్ మిక్చర్), మందులను గ్రామ పెద్దలు నాగేశ్వరరెడ్డి చేతుల మీదుగా ఉచితంగా అందించారు. చూడి కట్టని పశువులకు సైతం చూడి కట్టేలా తగిన మందులు అందించారు. పలువురు రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పశుగ్రాస విత్తనాలను అందించారు. పుల్లగుమ్మి, చుట్టు ప్రక్కల గ్రామాల రైతులు తీసుకువచ్చిన 150కుమించి పశువులకు వైద్యం అందించినట్లు పశు వైద్యాధికారి తెలిపారు. వైద్య శిబిరంలో వెల్దుర్తి, వివిధ ప్రాంతాల వెటర్నరీ డాక్టర్లు మనోజ్, మదన్, రాజశేఖర్ రెడ్డి, శాంతలత తదితరులు పశువులకు వివిధ రకాల వైద్య సేవలందించారు.

లాగిన్ సాకుతో సతాయింపు

హొళగుంద: కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం వస్తే తహసీల్దార్ కార్యాలయ అధికారులు లాగిన్ ఓపెన్ కావడం లేదంటూ సతాయిస్తున్నారని పలువురు శుక్రవారం నిరసనకు దిగారు. తమ పిల్లలను విద్యాసంస్థల్లో చేర్పేందుకు కుల, ఆదాయ ధ్రువపత్రాలు కావాల్సి ఉందని, వాటి కోసం రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తుందని వివిధ గ్రామాలకు చెందిన ఎర్రిస్వామి, హుసేని, లక్ష్మన్న, నాగరకణ్వి కావ్య, ఎల్లార్తి దేవరాజ్ వాపోయారు. కాగా కొంతమంది అధికారులు తమ యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లను ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చినట్లు సమాచారం. ధ్రువపత్రాల కోసం బాధితులు మీ సేవలో చలానా కట్టి ఆఫీసు చుట్టూ తిరుగుతున్నా ప్రైవేట్ వ్యక్తులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ లాగిన్ ఓపెన్ చేయడం లేదనే ఆరోపణలున్నాయి.

సన్మానం

హొళగుంద: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కన్నడ, ఉర్దూ మీడియం విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారానికి కృషి చేసిన హెచ్‌ఎం నజీర్ అహమ్మద్‌ను శుక్రవారం పలువురు ముస్లింమైనార్టీలు సన్మానించారు.

సుబ్రహ్మణ్య స్వామికి షష్టి పూజలు

మద్దికెర: సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి శుక్రవారం షష్టి సందర్భంగా విశేష పూజలు, ప్రత్యేక పూజ లునిర్వహించారు. ముందుగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజలు, మహామంగళహార తి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. దేవసేన, శ్రీవల్లి సమేతుడై కొలువు తీరగా అర్చకులు హోమాలు నిర్వహించారు. పూజలకు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు.

టెండర్లు వాయిదా

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో వివిధ పనులకు టెండర్లు పిలవగా సరైన స్పందన లేకపోవడంతో వాయిదా వేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ హెచ్.జి.వెంకటేశ్ తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

- ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి

ఆలూరు: పగిడ్యాల మండలం కొత్త ముచ్చుమర్రి గ్రామానికి చెందిన తొమ్మిదేళ్ల బాలిక అదృశ్యానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిన్నారి అదృశ్యమై ఆరు రోజులవుతున్నా ఆచూకీ కనిపెట్టకపోవడం దారుణమన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో విఫలమైందన్నారు. బాధిత కుటుంబాన్ని రాష్ట్ర హోం మంత్రి పరామర్శించి, వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

● హాలహర్వి: పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామంలో ఈనెల 7న బాలిక అదృశ్యానికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ నియోజకవర్గ నాయకులు బోయ మునిస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, తహసీల్దార్ బ్యూలాకు వినతి పత్రం అందించారు.

రైతులకు ప్రోత్సాహకాలు

ఆలూరు: పండ్ల తోటలను సాగు చేసుకునే సన్న, చిన్నకారు రైతులకు ఉపాధిహామీ పథకం ద్వారా ప్రోత్సాహకాలు అందిస్తున్నామని ఏపీఓ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం స్థానిక రైతు హనుమంతు పొలంలో చీనీ, బత్తాయి మొక్కలు నాటి నీరు పోశారు. ఈసందర్భంగా ఏపీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ కుంట, చెరువు, ఫాంపాండ్లు తవ్వించుకున్న రైతులందరికీ పండ్ల మొక్కులను పెంచుకునే వెసులుబాటు ఉందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మొహర్రం వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

మద్దికెర: మండలంలోని ఆయా గ్రామాల్లో మొహర్రం వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ రమేష్‌బాబు శుక్రవారం తెలిపారు. నిర్వాహకులతో ఎస్‌ఐ మాట్లాడుతూ పీర్ల పండగను కులమతాలకతీతంగా జరుపుకోవాలన్నారు. అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భూయజమానులకు భరోసా

మద్దికెర: కౌలు రైతులకు కార్డులు ఇవ్వడం వల్ల భూయజమానులకు ఎటువంటి నష్టం ఉండదని ఏఓ రవి తెలిపారు. శుక్రవారం పెరవలి, బురుజుల గ్రామాల్లో సర్పంచులు మల్లికార్జున, పద్మావతి అధ్యక్షతన కౌలు రైతుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతు సాగు హక్కు కార్డులు పొందిన రైతులకు కేవలం ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాలు, పంటల బీమా, పంటనష్టం పథకాలు మాత్రమే వర్తిస్తాయన్నారు. భూమిపై ఎలాంటి హక్కు ఉండదని, యజమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

కౌలు కార్డులకు అర్జీల స్వీకరణ


సూదేపల్లెలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

వెల్దుర్తి(కృష్ణగిరి): కౌలు కార్డుల జారీకి వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ సంయుక్తంగా గ్రామ సభలు నిర్వహించి కౌలు దారుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నారు. ఈనెల 11న ప్రారంభమైన గ్రామ సభలు 22వ తేదీ వరకు కొనసాగనున్నాయి. శుక్రవారం వెల్దుర్తి మండలం సూదేపల్లె గ్రామంలో గ్రామ సభ నిర్వహించిన వీఆర్‌ఓ మద్దిలేటి, అగ్రికల్చర్ అసిస్టెంట్ కలాం.. కౌలు రైతులను, భూ యజమానులను సమావేశపరిచి పలువురి నుంచి కౌలు కార్డులకు అర్జీలు స్వీకరించారు. దేవదాయ, వక్ఫ్ బోర్డు భూములు సైతం సాగు చేసే రైతులు కౌలు కార్డులు పొందేందుకు అర్హులని ఏఓ అక్బర్‌బాషా తెలిపారు. కౌలు కార్డుల జారీ ద్వారా భూ యజమానులకు ఎలాంటి నష్టం వాటిల్లదని, కౌలు దారులు గ్రామ సభల ద్వారా నైనా, సమీప ఆర్‌ఎస్‌కేలను, ఆయా గ్రామ వీఆర్‌ఓలను సంప్రదించి కౌలు కార్డుల కోసం దరఖాస్తులు అందించవచ్చని తెలిపారు. కౌలు కార్డులు పొందిన కౌలు రైతులు మాత్రమే ప్రభుత్వం అందించే రైతు సంక్షేమ పథకాలకు అర్హులవుతారని తెలిపారు.

వివాదాస్పద మురుగు కాలువ పరిశీలన


కాలువను పరిశీలస్తున్న అధికారులు

చిప్పగిరి: మండల కేంద్రంలో వివాదాస్పదంగా మారిన మురుగు కాలువను శుక్రవారం అధికారులు పరిశీలించారు. పలు కాలనీల నుంచి మురుగు నీరు, వర్షపు నీరు హరిజన కాలనీ సమీపంలో ఉన్న గుంతలోకి చేరుతుండటంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో గుంత వైపు మురుగు నీరు రాకుండా ప్రధాన రహదారి పక్కన వెళ్తున్న మురుగు కాలువలోకి వెళ్లేలా పంచాయతీ అధికారులు గురువారం పనులు చేపట్టారు. అయితే ప్రధాన రహదారి వెంట ఉన్న ప్రజలు తమ వైపు ఉన్న కాలువలోకి మురుగు నీరు ఎలా మళ్లిస్తారని అభ్యంతరం వ్యక్తం చేస్తూ పనులను అడ్డుకున్నారు. దీంతో శుక్రవారం ఎస్‌ఐ మహమ్మద్ రిజ్వాన్, ఎంపీడీఓ బరెన్ సాహెబ్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఎవరికీ ఇబ్బంది కలగకుండా పనులు చేపడుతున్నట్లు అధికారులు వివరించారు.

ఆటో వర్కర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప

వెల్దుర్తి(కృష్ణగిరి): ఆటో వర్కర్లకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, బీమా అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వరయ్య, మధు డిమాండ్ చేశారు. శుక్రవారం వెల్దుర్తి మండల కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో మినీ ఆటో వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ గౌరవాధ్యక్షుడిగా ఏసయ్య, ప్రధాన కార్యదర్శిగా బి రాము, అధ్యక్షుడిగా రాఘవేంద్ర, ట్రెజరర్‌గా బాలరాజును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా ట్రెజరర్ రాము, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జి నాగమద్దయ్య, ఏఐటీయూసీ మండల ప్రతినిధులు మాధవస్వామి, కొకిల నాగరాజు, బలరాం, కృష్ణ, మగ్బుల్, సురేశ్, సూరి, నాగరాజు పాల్గొన్నారు.

పశువుల యాజమాన్యాలపై చర్యలు తీసుకోండి



రోడ్డుకు అడ్డంగా పడుకుని ఉన్న పశువులు

ఆలూరు: నిర్లక్ష్యంతో మూగజీవాలను రోడ్లపైకి వదులుతున్న వాటి యజమానులపై చర్యలు తీసుకోవాలని పలువురు వాహనదారులు అధికారులను కోరుతున్నారు. నియోజకవర్గ కేంద్రంలోని 167 నేషనల్ హైవే నుంచి హైదారాబాద్, కర్నూలు, అనంతపురం జిల్లాలను కలుపుకుని ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ, కర్ణాటక రాష్ట్రం బళ్లారి, రాయచూరు, శివమొగ్గ, హుబ్లీ, గదగ్, చిక్‌బళ్లాపూర్, బెంగళూరు, మద్రాస్ తదితర ప్రాంతాలకు కర్ణాటక ఆర్టీసీ బస్సులు రోజుకు పదుల సంఖ్యలో తిరుగుతున్నాయి. దీనికి తోడు ఏపీఎస్‌ఆర్టీసీ బస్సులు, లారీలు, టాటాఏసీలు, మినీ టిప్పర్లు వందల సంఖ్యలో తిరుగుతున్నాయి. ఇంత రద్దీగా ఉండే ఆలూరులో కొందరు పశువులను రోడ్లపైకి వదిలేస్తున్నారు. అవి ఎక్కడపడితే అక్కడ రోడ్డుకు అడ్డంగా పడుకొని ఉండటంతో ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. పలుమార్లు వాహనదారులు ప్రమాల బారిన పడిన సందర్భాలు కూడా ఉన్నాయి. రైతులకు సంబంధించినవంటూ పశువైద్యాధికారులు ట్యాగ్‌లు వేసిన పశువులు కావడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పశువులను రోడ్లపైకి వదలకుండా యజమానులకు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

సంపద తయారీ కేంద్రాలకు గ్రహణం

- నిరుపయోగంగా డంప్‌యార్డ్‌లు
- గ్రామాల్లో లోపించిన చెత్త సేకరణ


ముక్కెళ్లలో నిరుపయోగంగా డంపింగ్‌యార్డు


రాంపల్లిలో డంప్‌యార్డు దుస్థితి

తుగ్గలి: స్వచ్ఛసంకల్పం పేరుతో లక్షలు ఖర్చుపెట్టి పంచాయతీల్లో నిర్మించిన డంపింగ్‌యార్డ్‌లు నిరుపయోగంగా మారాయి. మండలంలో 23 పంచాయతీల్లో సుమారు రూ.7లక్షల నుంచి రూ.8లక్షలదాకా అంచనా వ్యయంతో తడి చెత్త, పొడి చెత్త శుద్ధి కేంద్రాలుగా నిర్మించిన డంపింగ్ యార్డ్‌లు శిథిలావస్థకు చేరాయి. ఈ యార్డుల్లో గ్రామాల్లో తడి, పొడి చెత్తలను సేకరించి యార్డుల్లో వేరుచేసి సేంద్రియ ఎరువులను తయారు చేయాలి. ఆ ఎరువులను తక్కువ ధరకు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం లక్షలు ఖర్చు పెట్టి నిర్మించింది. చెత్త సేకరణ కోసం చెత్త రిక్షాలు, గ్రీన్ అంబాసిడర్లను ప్రత్యేకంగా నియమించింది. అయితే అవి ఎక్కడా వినియోగంలో లేవు. దీంతో గ్రామాల్లో ఎక్కడ వేసి చెత్త అక్కడే ఉంటోంది. సంపద కేంద్రాల్లో ఎక్కడా వర్మీకంపోస్టు ఎరువు తయారు కావడం లేదు. చెత్త రిక్షాలు మూలన పడి తుప్పుపడుతున్నాయి. డంపింగ్‌యార్డుల చుట్టూ పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు మొలిచి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఉన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన వీటిని గాలి కొదిలేయడంతో రూ.కోట్ల ప్రజాధనం వృథా అవుతోంది. చెత్త సేకరణ చేసే సిబ్బందికి వేతనాలు సరిగా రాక పోవడం, అధికారుల పర్యవేక్షణ కరువై అవి నిరుపయోగంగా దర్శన మిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డంపింగ్‌యార్డ్‌లను తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకొస్తాం

చెత్త సంపద తయారీ కేంద్రాలను పరిశీలిస్తున్నాం. చెత్త సేకరించే సిబ్బందికి వేతనాల్లో జాప్యం కలుగుతోంది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చెత్త సేకరణ సజావుగా సాగేలా చూస్తాం.

– గోపాల్, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ, తుగ్గలి

కొలువుదీరిన పీర్లు

హొళగుంద: మండలంలో మొహర్రం వేడులు ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఆయా గ్రామాల్లోని పీర్ల చావిళ్లలో దేవుళ్ల కొలువు దీరాయి. హొళగుంద మండల కేంద్రంలోని బాలా మసీదు, చిన్న మసీదు, రాజానగర్ కాలనీ తదితర చావిళ్లలో పీర్ల దేవుళ్లను కొలువుదీర్చారు.